వైభవంగా వసంత పంచమి వేడుకలు



వసంత పంచమి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బీపీఎల్ ఒలింపియాడ్ స్కూల్‌లో బుధవారం వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సరస్వతిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి మాట్లాడుతూ... చదువుల తల్లి సరస్వతిదేవిని పూజిస్తే విద్యతో పాటు తెలివితేటలు పెరుగుతాయన్నారు. అనంతరం విద్యార్థులతో సరస్వతి అష్టోత్తర పారాయణం చేయించారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు మేయర్‌కు ఆహ్వానం



మేయర్ నీలారెడ్డిని కలిసిన సేవాలాల్ బంజారా సేవా సంఘం నాయకులు

నిజాంపేట్: సేవాలాల్ మహారాజ్ సేవలు చిరస్మరణీయమని నిజాంపేట మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ రాములు నాయక్, సేవాలాల్ బంజార సేవా సంఘం సభ్యులు మేయర్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం సేవాలాల్ మహారాజ్ జయంతి నేపథ్యంలో వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. సంఘం సభ్యులు రాంచందర్ నాయక్, రవి నాయక్, గోపాల్ నాయక్, పాండు నాయక్, గోపాల్ నాయక్ తదితరులు ఉన్నారు.

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అవసరం



అరటిపళ్లు తింటున్న చిన్నారులు

జీడిమెట్ల: పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుందని నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ కేఎం ప్రతాప్ అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం కార్యక్రమాన్ని ప్రారంభిచారు. కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు విద్యార్థులకు అరటిపండ్లను తినిపించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ఆర్ బాషా, ప్రిన్సిపల్ మహేందర్ రెడ్డి, ప్రీప్రైమరీ ఇన్‌చార్జ్ భార్గవిరెడ్డి, ఉపాధ్యాయులు పద్మజ, రజిత, శ్రీరమ్య, మౌనిక, విజయలక్ష్మి, శ్రీజలు పాల్గొన్నారు.

చర్యలు నిల్.. వసూళ్లు ఫుల్.!

కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల బరితెగింపు

- అక్రమకట్టడాలతో ముంపు కాలనీవాసుల జీవితాలు ప్రశ్నార్థకం
- 33/8లో అక్రమ నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అధికారుల అండ
- అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్
- అనుమతి లేకుండా షెడ్ నిర్మించారని తేల్చిన విజిలెన్స్ అధికారులు



ఫాక్స్‌సాగర్ కట్టకింద వెలిసిన అక్రమ నిర్మాణం

జీడిమెట్ల: జీహెచ్‌ఎంసీ పరిధిలో వెలిసే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులే అక్రమార్కులతో దోస్తీ కట్టి అడ్డదారుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని.. ముంపు ప్రాంతమైన సుభాష్‌నగర్ డివిజన్ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని డివిజన్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల అధికారులు తనిఖీలకు వెళ్తే గేట్లు బంద్..

ఫాక్స్‌సాగర్ చెరువు కట్ట దిగువ భాగంలో 33/8 సర్వేనెంబర్‌లో ఎకరం జాగాలో అక్రమ బారీషెడ్లను నిర్మిస్తున్నారన్న ఫిర్యాదుతో స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తనిఖీలకు వెళ్లారు. అధికారులను లోనికి రానివ్వకుండా గేట్లకు తాళాలు వేసి షెడ్డు పనులు పూర్తిచేశారు. గంటల తరబడి బయట నిలబడిన అధికారులు చేసేది లేక చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పి వెనుదిరిగారు.

చెరువు కబ్జాతో ముంపుబారిన సుభాష్‌నగర్ డివిజన్..

ఇప్పటికే ఫాక్స్‌సాగర్ చెరువును 300ఎకరాలకు పైగా కబ్జా చేసిన కేటుగాళ్లు ఇప్పుడు ఎఫ్‌టీఎల్, బఫర్‌లను సైతం అక్రమించి అగ్రికల్చర్ ల్యాండ్‌లలో ఇలాంటి అనుమతులు లేని ఎకరాల స్థలాల్లో బారీషెడ్లను నిర్మించడంతోనే చెరువు మత్తడి నుంచి వచ్చే వరదనీరు దిగువ చేరి బస్తీలను ముంచెత్తోంది. ఫాక్స్‌సాగర్ చెరువు స్థలం కబ్జాకు గురికావడంతో సుభాష్‌నగర్ డివిజన్‌లోని చాలా కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.



గత వర్షాకాలంలో నీట మునిగిన సుభాష్‌నగర్

అక్రమమని తేల్చిన విజిలెన్స్ అధికారులు

33/8లో వెలసిన భారీషెడ్ పూర్తిగా అక్రమమని దానిపై విజిలెన్స్ అధికారులు సైతం సర్వేచేసి అక్రమమని తేల్చారన్నారు. ఈ షెడ్‌కు ఎలాంటి అనుమతులు లేవని సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చిస్తే చెప్పారని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకునేది కూడా పూర్తిగా జీహెచ్‌ఎంసీ అధికారులకే ఉందన్నారు.

లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలి

నిజాంపేట్: ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ల పరం చేస్తోందని... నాలుగు లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని మేడ్చల్ జిల్లా సీఐటీయు నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 16న దేశ వ్యాప్త సమ్మెను పురస్కరించుకుని బుధవారం బాచుపల్లి ఇండస్ట్రీయల్ ఏరియా, ఆలీప్ ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయడంతో పాటు పీఎఫ్, పింఛన్లను అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేలా కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వామి, ప్రవీణ్, ఎల్లమ్మ, యాదగిరి, ఐఎన్‌టీయుసీ నియకులు కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్‌గా సయ్యద్ మతిన్



బాధ్యతలు స్వీకరిస్తున్న సయ్యద్ మతిన్

దుండిగల్: గండిమైసమ్మ – దుండిగల్ మండల తహసీల్దార్‌గా సయ్యద్ మతిన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సుచరిత కాప్రా మండలానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో కాప్రాలో పని చేస్తున్న మతిన్ ఇక్కడికి వచ్చారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పౌరసేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తామని పేర్కొన్నారు.

వీర జవాన్‌లకు నివాళులర్పిస్తున్న విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు



వీర జవాన్లకు నివాళి

రంగారెడ్డినగర్: దేశసరిహద్దుల్లో సైనికులు లేకుండా మనం స్వేచ్ఛగా బతకలేమని విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు జంగా తాతాజీ అన్నారు. బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చింతల్ హెచ్‌ఎంటీలోని నిర్మన్ మానసిక వికాలాంగుల ఆశ్రమంలోని వికలాంగులతో కలిసి పుల్వామా దాడిలో మృతిచెందిన జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో ఉన్న వికలాంగులకు బ్రెడ్, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహ, సభ్యులు చిన్నా, పి.నాగరాజు, రమేష్, రాజశేఖర్, నగేష్, మహేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ల సేవలు వెలకట్టలేనివి

సుభాష్‌నగర్: దేశం కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా జవాన్ల సేవలు వెలకట్టలేనివని సూరారం నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. ఫిబ్రవరి 14న పుల్వామా దాడిలో భారత సైనికులు వీర మరణం పొందారు. అమరులైన వీర బుధవారం పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. పుల్వామా దాడుల్లో మరణించిన జవాన్లకు ఘన నివాళులు అర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జవాన్ సర్వర్ హుస్సేన్ ఖాన్, వారి పెద్ద కుమారుడు మజ్ హర్ హుస్సేన్ (జవాన్ చిన్న కొడుకు పుల్వామా దాడుల్లో మరణించడంతో వారి సేవలను కొనియాడుతూ సన్మానించారు.



రిటైర్డ్ జవాన్లను సన్మానిస్తున్న కోలా వెంకటేష్ ముదిరాజ్

కార్పొరేట్ సంస్థల సేవలు అభినందనీయం

నిజాంపేట్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్

నిజాంపేట్: ప్రైవేటు కంపెనీలు ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. బుధవారం నిజాంపేట్‌లోని కేటీఆర్ కాలనీలో గ్రోబ్ మెషిన్ టూల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఫండ్స్‌తో నిర్మించిన లేడిస్ వాష్‌రూంలు, కేఫ్‌టేరియాలను రూ.12లక్షలతో నిర్మించారు. బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ సంస్థలు, కంపెనీలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం మంచి పరిణామమన్నారు. కంపెనీ ఎండీ ఎల్‌జే నాయుడు మాట్లాడుతూ... ఈ సంవత్సరం పార్కు అభివృద్ధి కోసం రూ.12.5లక్షలు సీఎస్ఆర్ ఫండ్స్ ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నిపుణ్‌నెట్ సోల్యూషన్స్ సీఈఓ కేకే చౌదరి, కార్పొరేటర్ రవికిరణ్, కేటీఆర్ కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, సతీష్ నాయుడు, జయంతి, వర్మ, నాగేశ్వర్‌రావు, రామ్మోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఆర్ ఫండ్స్‌తో నిర్మించిన భవనాలను ప్రారంభిస్తున్న రంగరాయ ప్రసాద్

4.65కేజీల ఆడ శిశువు జననం

జీడిమెట్ల డివిజన్ సుచిత్ర రోడ్డులోని భాగ్యలక్ష్మి కాలనీలో ఉన్న లక్ష్మి శైలజ ఆస్పత్రిలో బుధవారం ఓ మహిళ 4.65 కేజీల బరువున్న ఆడ శిశువుకు జన్మనిచ్చింది. రేవతి అనే మహిళ రెండో కాన్పు కోసం ఆస్పత్రిలో చేరింది. కాగా శిశువు అధిక బరువుతో ఉండటంతో ఆమెకు డాక్టర్ శైలజ ప్రకాష్ సిజేరియన్ చేయగా ఆడ శిశువును ప్రసవించింది. తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా బాల భీముడిని తలపిస్తూ ముద్దుగా ఉన్న చిన్నారని చూసి బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – కుత్బుల్లాపూర్



శిశువుతో డాక్టర్ శైలజ ప్రకాష్



గండిమైసమ్మ- భౌరంపేట్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

దుండిగల్: గండిమైసమ్మ– బౌరంపేట్ రహదారిలో బుధవారం రాత్రి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నర్సాపూర్ రాష్ట్ర రహదారి, అటు మియాపూర్, మరో వైపు మేడ్చల్‌కు వెళ్లే చౌరస్తా కావడంతో నిత్యం వాహనాల తాకిడి అధికంగా ఉంటుంది. దాదాపు 2గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు అసహనానికి గురయ్యారు. స్థానిక ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్ది వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని హోలీ ఫెయిత్ హైస్కూల్‌లో బుధవారం 10వ వార్షికోత్సవ వేడుకలు, గ్రాడ్యుయేషన్ డేలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మేరీ రేణుక, ప్రిన్సిపాల్ కమల ప్రియ మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా లాభాపేక్ష లేకుండా అన్ని వర్గాల విద్యార్థులకు తమ పాఠశాలలో విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, షబానా ఆఫ్రోజ్, కేఎస్ చారి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరస్పాండెంట్ మేరి రేణుకాను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కార్లను అద్దెకు తీసుకుని మరో వ్యక్తికి తనఖా

తప్పించుకు తిరుగుతున్న వ్యక్తి అరెస్టు

నిజాంపేట్: కార్లను అద్దెకు తీసుకుని మరో వ్యక్తికి తనఖా పెట్టి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీకి చెందిన సయ్యద్ ఖాజాహబీబ్ అన్సారీ నిజాంపేట్ విజ్ఞాన్ స్కూల్ సమీపంలో యూనివర్సల్ కార్స్ ట్రావెల్స్‌ను నిర్వహిస్తున్నాడు. కాగా ఏప్రిల్ 27, 2022లో తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి మండలం, హోసూర్ గ్రామానికి చెందిన రవి(46) హబీబ్ వద్దకు వచ్చి రెండు కార్లు ఇన్నోవా క్రిస్టా(టీఎస్08ఎఫ్9126), ఎర్టిగా (టీఎస్08జీఆర్1648)లను నెలకు రూ.1.40 లక్షల అద్దె ఇచ్చి తీసుకున్నాడు.

◆ తదనంతరం మే 6, 2022లో మరోసారి యూనివర్శల్ కార్స్ ట్రావెల్స్‌కు వచ్చి రూ.40 వేలు చెల్లించి షిఫ్ట్ కారు (టీఎస్08జీడబ్ల్యూ006)ను రవి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో గతంలో ఇచ్చిన రెండు కార్ల అద్దె విషయమై హబీబ్ అన్సారీ అడుగగా వారం రోజుల్లో ఇస్తానని చెప్పిన రవి ఇవ్వలేదు. కార్లను తిరిగి ఇవ్వకపోగా అద్దెకు సైతం చెల్లించకపోవడంతో హబీబ్ అన్సారీ పలుమార్లు రవి మొబైల్‌కు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కాగా తన కార్లు జీపీఎస్ ట్రాకర్ ద్వారా హోసూర్ సిటీలో కార్లు ఉన్నట్లు గుర్తించిన బాధితుడు తమిళనాడు హోసూర్‌కు వెళ్లి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా రవి థర్డ్ పార్టీకి కార్లను తనఖా పెట్టినట్లు తెలిసింది.

◆ అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు విషయమై బాచుపల్లి పోలీసుల హోసూర్ వెళ్లి థర్డ్ పార్టీ వద్ద ఉన్న ఎర్టిగా కారును స్వాధీనం చేసుకుని, నిందితుడు రవిని బుధవారం బాచుపల్లి పీఎస్‌కు తీసుకువచ్చారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన బాచుపల్లి సీఐ ఉపేందర్, ఎస్సై రమేష్, సిబ్బంది యాదగిరి, రాజులను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



ఎర్టిగా కారుతో సహా నిందితుడు రవిని అదుపులోకి తీసుకున్న బాచుపల్లి పోలీసులు

కల్యాణం.. కమనీయం



లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం 6గంటల నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మధ్యాహ్నం 12గంటలకు తిరు కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ జగన్ కుటుంబం సమేతంగా అలివేలు మంగమ్మ, పద్మావతి అమ్మవార్లకు ఒక టిన్నర కిలోల వెండిని విరాళంగా అందజేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు మెదక్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. – జగద్గిరిగుట్ట





ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



సుభాష్‌నగర్: సుచిత్ర 44వ జాతీయ రహదారి అనుకొని ఉన్న ఎల్లమ్మ ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం బుధవారం జై హనుమాన్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణం కనుల పండగ జరిగింది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటిషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.